పుట్టింటి సారెతో మల్లన్న చెంతకు

- శతాబ్దాల నుంచి కొనసాగుతున్న కన్నడ భక్తుల ఆచారం
- మండుటెండల్లో వందల కిలోమీటర్ల పాదయాత్ర
- వృద్ధులు, మహిళలు సైతం నడుచుకుంటూ శ్రీగిరి చేరుకుంటున్న వైనం



నల్లమల అటవీ ప్రాంతంలో కాలినడకన వస్తున్న భక్తులు



భక్తులతో కిటకిటలాడుతున్న శ్రీశైలక్షేత్ర పురవీధి

శ్రీశైలంటెంపుల్: మరెక్కడా లేని విధంగా శ్రీశైల మహాక్షేత్రంలో ఉగాది మహోత్సవాలకు ఓ ప్రత్యేకత ఉంది. ఉగాది ఉత్సవాలకు కన్నడ భక్తులు లక్షలాదిగా తరలివచ్చి శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను దర్శించుకుంటారు. అలాగే భ్రమరాంబాదేవిని తమఇంటి ఆడపడుచుగా, మల్లికార్జున స్వామిని తమ సొంత అల్లుడిగా భావించి పుట్టింటి నుంచి అమ్మవారికి భక్తిశ్రద్ధలతో సారె తీసుకుని వచ్చి సమర్పించడం ఆనవాయితీ. శతాబ్దాల కాలం నుంచి ఈ ఆచారం కొనసాగుతోంది. అంతేకాకుండా తమ సొంత గ్రామాల నుంచి మండుటెండలో పాదయాత్ర చేసుకుంటూ శ్రీగిరి చేరుకోవడం విశేషం. వయసుతో నిమిత్తం లేకుండా వృద్ధులు, మహిళలు సైతం నల్లమల అటవీప్రాంతో శివనామస్మరణ చేసుకుంటూ నడుచుకుంటూ వస్తున్నారు.

ఫాల్గుణ మాసంలో పాదయాత్ర ప్రారంభం

శ్రీశైలక్షేత్రంలో జరిగే ఉగాది మహోత్సవాలకు కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి లక్షలాదిగా కన్నడ భక్తులు తరలివస్తున్నారు. ఇందులో ఎక్కువ భాగం కాలినడకన వచ్చేవారు ఉన్నారు. వీరు ప్రతి ఏటా ఫాల్గుణ మాసం ప్రారంభంకాగానే దూరాన్ని బట్టి శ్రీశైలక్షేత్రంలో జరిగే ఉగాది మహోత్సవాల సమయానికి చేరుకునేలా సొంత గ్రామాల నుంచి బయలుదేరి కాలినడక మండుటెండలో సుమారు 25 రోజుల పాటు నడుచుకుంటూ శ్రీగిరి చేరుకుంటారు. మరికొందరు రాష్ట్ర సరిహద్దు గ్రామమైన హొళగుంద మండలంలోని ఎల్లార్తి దర్గా వద్ద దర్శనం చేసుకొని పాదయాత్ర ప్రారంభింస్తారు. మరికొందరు కర్నూలు నుంచి, వెంకటాపు రం నుంచి పాదయాత్ర చేపడతారు. నడవలేని వారు వాహనాల్లో శ్రీశైలానికి చేరుకుంటారు. శ్రీగిరి లో బస చేసి ఉత్సవాల అనంతరం తిరుగు పయనమవుతారు. అమ్మవారికి నిర్వహించే ప్రత్యేక అలంకరణ, స్వామిఅమ్మవార్లకు నిర్వహించే విశేష వాహనసేవలను కన్నులారా తిలకించి కర్పూర నీరాజనాలు సమర్పించి భక్తితో పరవశించి పోతారు.

పుట్టింటి సారెతో

శ్రీశైల భ్రమరాంబాదేవిని తమ ఇంటి ఆడపడుచుగా, మల్లికార్జున స్వామిని తమ అల్లుడిగా కన్నడ భక్తులు భావిస్తారు. ఉగాది మహోత్సవాల సందర్భంగా అమ్మవారికి పుట్టింటి సారె (పసుపు, కుంకుమ, గాజులు, వస్త్రాలు) తీసుకుని కాలినడక బయలుదేరుతారు. శ్రీశైల క్షేత్రానికి బయలుదేరే ముందు కన్నడిగులు తమ ఇంట్లో అఖండజ్యోతిని వెలిగిస్తారు.

సెలవుల్లో జూపాడుబంగ్లా ఎంపీడీఓ

జూపాడుబంగ్లా: జూపాడుబంగ్లా ఎంపీడీఓ మంజులవాణి 18 రోజుల సెలవుపై వెళ్లారు. ఈమె స్థానంలో ఈఓపీఆర్డీ మణిమంజరికి జిల్లా అధికారులు ఎంపీడీఓగా బాధ్యతలు అప్పగించారు. ఎంపీడీఓ మంజులవాణి చైల్డ్‌కేర్ లీవుల్లో వెళ్లినట్లు ఎంపీడీఓ కార్యాలయ అధికారులు తెలిపారు. ఏప్రిల్ 1న ఆమె ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. అప్పటి దాకా జూపాడుబంగ్లా మండల ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా ఈఓపీఆర్డీ మణిమంజరి వ్యవహరించనున్నారు.

వ్యక్తి అదృశ్యం

కొత్తపల్లి: మండల పరిధిలోని నందికుంట గ్రామంలో ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. కుటుంబ సభ్యులు ఈ విషయమై కొత్తపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నందికుంట గ్రామానికి చెందిన నిమ్మల వెంకటేశ్వర్లు అనే వ్యక్తి ఈనెల 14న రాత్రి 8 గంటల సమయంలో ఆత్మకూరుకు వెళ్లివస్తానాని భార్య నిమ్మల శివమ్మకు చెప్పి వెల్లాడు. తెల్లవారినా వెంకటేశ్వర్లు ఇంటికి రాకపోవడంతో భార్య ఫోన్ చేసింది. ఫోన్ స్విచ్‌ఆఫ్ వచ్చింది. దీంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గ్రామాలు, బంధుమిత్రులను విచారించారు. అయిన అతని ఆచూకీ తెలియలేదు. దీంతో శనివారం కొత్తపల్లి పోలీస్టేషన్‌లో భార్య శివమ్మ ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా

పది పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు



పరీక్షల ఏర్పాట్లపై హెచ్‌ఎం శివజ్యోతికి సూచనలిస్తున్న తహసీల్దార్ సిరాజుద్దీన్

మిడుతూరు: ఏప్రిల్ 3 నుంచి నిర్వహించనున్న పదో తరగతి పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని తహసీల్దార్ సిరాజుద్దీన్ అన్నారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు అన్ని మౌలిక సదుపాయాలపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివజ్యోతిని అడిగి తెలుసుకున్నారు. పరీక్షా కేంద్రంలో పరీక్ష రాసే విద్యార్థులకు అనుగుణంగా అన్ని వసతులు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో వీఆర్వో వెంకటయ్య ఉన్నారు.

చేతిపంపుల మరమ్మతుకు చర్యలు



చేతి పంపు మెటీరియల్ ఎంపీడీఓ కార్యాలయంలోకి తీసుకెళ్తున్న దృశ్యం

పాములపాడు: వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని చేతి పంపుల మరమ్మతులకు మెటీరియల్ అందుబాటులో ఉంచుతున్నట్లు ఏఈ ఆర్‌డబ్ల్యూఎస్ జుబేర్ శనివారం తెలిపారు. ఎంపీపీ నిధుల నుంచి రూ.4లక్షలతో మెటీరియల్ తెప్పించినట్లు వెల్లడించారు. ఏ గ్రామంలోనైనా చేతి పంపులు మరమ్మతులకు గురైతే వెంటనే రిపేరీ చేయిస్తామని, ప్రజలకు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రస్తుతం మండలంలో జీఐ పైపులు, కనెక్టింగ్ రాడ్స్, సిలిండర్ బాడీ, హెడ్ అసెంబ్లీ, హ్యాండిల్ అసెంబ్లీ, సిలిండర్ అసెంబ్లీ, అప్పర్ వాల్, లోయర్ వాల్, చైన్‌క ప్లింగ్, నట్లు మొదలైన పనిముట్లు అందుబాటులో ఉన్నాయని వివరించారు.

గిరిజనులకు క్షయవ్యాధిపై అవగాహన



ఎర్రకుంట గూడెం గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న టీబీ సూపర్‌వైజర్ రవికుమార్

కొత్తపల్లి: మండలంలోని గువ్వలకుంట్ల గ్రామసచివాలయం పరిధిలోని మజరా గ్రామాలైన పాలెంచేరువు, ఎర్రకుంట గూడెంలలో శనివారం కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆధ్వర్యంలో ఆత్మకూరు టీబీ సూపర్‌వైజర్ చెరుకు రవికుమార్ క్షయవ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాలెం చెరువు ప్రభు త్వ గిరిజన ఆశ్రమ పాఠశాల అవరణలో గిరిజనులకు, విద్యార్థులకు, ఎర్రకుంట గూడెంలోని ఉపాధి హామీ కూలీలకు క్షయవ్యాధి లక్షణా లను వివరించారు. ఈ వ్యాధి శరీరంలో గోర్ల కు, వెంట్రుకలు కాకుండా మిగతా భాగాలనింటికి సోకవచ్చని తెలిపారు. వ్యాధి తీవ్రతను బట్టి క్రమం తప్పకుండా 6 నుంచి 18 నెలలు మందులు వాడటంతో వ్యాధి నాయమవుతుందని చెప్పారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఈ వ్యాధిని నివారించవచ్చునన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సరితా, ఉపాధాయులు పాల్గొన్నారు.

టీకాల కార్యక్రమం క్రమం తప్పకుండా నిర్వహించాలి



తిమ్మాపురంలో వ్యాక్సినేషన్ వివరాలు తెలుసుకుంటున్న డీఐఓ డాక్టర్ ప్రభావతి

మహానంది: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా నిర్వహించాలని నంద్యాల జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ ప్రభావతి ఆదేశించారు. తిమ్మాపురం గ్రామంలో శనివారం టీకాల కార్యక్రమాలపై ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. డాక్టర్ రూపేంద్రనాథ్ రెడ్డి, ఎంపీహెచ్‌ఈఓ విజయ్‌రెడ్డిలతో కలిసి గ్రామంలో పర్యటించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి బుధ, శనివారాల్లో అన్నిగ్రామాల్లో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం జరుగుతుందన్నారు. తమ పిల్లలకు వేయించేలా తల్లుల్లో అవగాహన కల్పించాలని కోరారు.

వేతనాలు చెల్లించాలి

ఆత్మకూరు: స్వచ్ఛభారత్ కార్మికులకు వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఏసురత్నం డిమాండ్ చేశారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. 6 నెలలుగా కార్మికులకు వేతనాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. నాయకులు రజాక్, రామ్‌నాయక్, భాస్కర్ పాల్గొన్నారు.

రైతు నేస్తం

మామిడిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



మామిడి రైతులకు సూచనలిస్తున్న హార్టికల్చర్ అధికారి హరినాథ్‌రెడ్డి

ఆత్మకూరు: జిల్లాలో ప్రస్తుతం కురుస్తున అకాల వర్షాలకు, ఈదురు గాలుల వలన మామిడి రైతులు భారీగా నష్టపోయే ప్రమాదం ఉందని, వెంటనే సస్యరక్షమ చర్యలు చేపట్టాలని హార్టికల్చర్ అధికారి హరినాథ్‌రెడ్డి అన్నారు. శనివారం ఆత్మకూరు డివిజన్‌లోని ఆత్మకూరు, వెలుగోడు మండలాల్లోని మామిడి తోటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నంద్యాల జిల్లాలోని వివిధ మండలాల్లో 5,900 ఎకరాల్లో మామిడితోటలు ఉన్నాయన్నారు. ఈ వర్షాలకు, గాలులకు మామిడికాయలపై మచ్చలు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. సెం.మీ కంటే వర్షం అధికంగా కురిస్తే రైతులు తప్పనిసరిగా మామిడితోటల్లో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమయంలో మామిడి తోటలు పూత, కాయల దశలో ఉన్నాయని, రైతులు జాగ్రత్త పడాలన్నారు. ప్రధానంగా 100 గ్రాముల కాయ కలిగిన తోటల్లో ఈ వర్షాలకు పిందెలు గట్టి పడి సైజ్ రావడం జరుగుతుందన్నారు. మచ్చ, పూరెమ్మ మాడు తెగులు వచ్చే అవకాశం ఉన్నందున మామిడి తోటల్లో రైతులు ఇమిడాక్లోఫ్రిడ్ లేదా కార్బన్డజిం, మాంకోజెడ్ 2.5 గ్రాములు కలిపి పిచికారీ చేయాలని సూచించారు. చిన్న పిందెలు, పూత దశలో ఉన్నప్పుడు లేత ఆకులు, పిందే వచ్చే దశ ఉన్నందున తేనె పురుగు, తామర పురుగు ఆశించే అవకాశం ఉన్నందున రైతులు తప్పనిసరిగా ఇమిడాక్లోఫ్రిడ్ పిచికారీ చేయాలన్నారు.

సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గుచూపాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ సుబ్రమణ్యం

మహానంది: పంటల సాగులో రైతులు రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ వ్యవసాయ సాగు పద్ధతులపై దృష్టి సారించాలని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సుబ్రహ్మణ్యం సూచించారు. గాజులపల్లెలో శనివారం అనంతరాజుపేట ఉద్యాన కళాశాల ఆధ్వర్యంలో రైతులకు పంటలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన మాట్లాడుతూ సేంద్రియ పద్ధతులతో సాగుచేసి పండించిన పంట దిగుబడులకు మార్కెట్‌లో మంచి ఆదరణ ఉందన్నారు. కార్యక్రమంలో వివిధ విభాగాల శాస్త్రవేత్తలు డాక్టర్ ఠాగూర్‌నాయక్, రూథ్‌బెనర్జీ, శ్రీధర్, వ్యవసాయాధికారి నాగేశ్వరరెడ్డి, గ్రామ సర్పంచ్ గడ్డం చంటి, ఎంపీటీసీ చౌటుపల్లి నరసింహులు, వైఎస్సార్‌సీపీ నేత కొండా మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా రాష్ట్రస్థాయి ఎడ్ల బల ప్రదర్శన



పోటీలను ప్రారంభిస్తున్న శిల్పా భువనేశ్వర్‌రెడ్డి

వెలుగోడు: పట్టణంలోని హజరత్ సయ్యద్ రోఖియా బీ ఉరుసు ఉత్సవాల సందర్భంగా శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సహకారంతో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఎడ్ల బల ప్రదర్శన (న్యూక్యాటగిరి) పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. శనివారం ఈ పోటీలను వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు శిల్పా భువనేశ్వరరెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. రోఖి యాబీ ఉరుసును స్థానికులు కులమతాలకు అతీతంగా నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఏటా ఉరుసు సందర్భంగా శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఎద్దుల బల ప్రదర్శన పోటీలు నిర్వహిస్తూ..రైతులపై ఆయనకు ఉన్న ప్రేమను చాటుతున్నారని తెలిపారు.

విజేత పెద్దకొట్టాల వృషభాలు

ప్రదర్శనలో 8 జతలు పాల్గొనగా.. హోరాహోరీగా సాగిన పోటీల్లో పెద్ద కొట్టాలకు చెందిన బోరెడ్డి కేశవ రెడ్డి వృషభాలు ప్రథమ స్థానంలో నిలిచాయి. వీటి యజమానికి మొదటి బహుమతిగా ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సహకారంతో రూ. 50,000 నగదు అందజేశారు. రెండో స్థానంలో కర్ణాటక రాష్ట్రం పలకం దొడ్డి గ్రామానికి చెందిన ఖాజాహుస్సేన్ ఎద్దులు నిలువగా రూ.40,000 (దాతలు: వేల్పుల జయపాల్, జెడ్పీటీసీ సభ్యురాలు డి. అమీరున్‌బీ), నంద్యాల జిల్లా కానాల గ్రామానికి చెందిన గుండం చెన్నారెడ్డి ఎద్దులు మూడో స్థానంలో రూ. 25,000 (మాజీ సింగిల్ విండో చైర్మన్ వంగాల వెంకట్రామిరెడ్డి), బేతంచెర్ల మండలం గొర్లగట్టు గ్రామానికి చెందిన గోవర్ధన్‌రెడ్డి ఎద్దుల నాల్గో బహుమతి రూ. 15,000 (వంగాల నాగేశ్వరరెడ్డి, బన్నూరు అంకిరెడ్డి, బన్నూరు జనాభారెడ్డి) అందుకున్నాయి. పద్దమాల వాహబ్‌మియా, ఇస్కాల గ్రామానికి చెందిన నాగార్జున ఎద్దులకు సంయుక్తంగా ఐదవ బహుమతి రూ. 10,000 (ఏపీఎస్‌పీడీసీఎల్ డైరెక్టర్ డాక్టర్ శశికళారెడ్డి), ఇస్కాల గ్రామానికి చెందిన నాగార్జున, వాహబ్ మియా ఎద్దులకు ఆరోస్థానంలో రూ. 5000 (అంబాల రామకష్ణారెడ్డి , సర్పంచ్ అంబాల నాగలక్ష్మమ్మ) సహకారంతో అందజేశారు. చాపిరేవుల గ్రామానికి చెందిన ఎర్రమల్ల శేషారెడ్డి ఎద్దులకు కన్సోలేషన్ బహుమతి అందించారు. ఈ పోటీలకు నిర్వాహకులుగా వైఎస్సార్‌సీపీ నాయకులు దేశం తిరుపం రెడ్డి, అంబాల ప్రభాకర్‌రెడ్డి వ్యవహరించారు. కార్యక్రమంలో సర్పంచ్ వేల్పుల జయపాల్, కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ సులేమాన్, కే. రామ్మోహన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ ఖాన్, అమీర్ అలీఖాన్, బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోగోలు శివశంకర్‌నాయుడు, మూడిమేల సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్

అట్టహాసంగా సెపక్‌తక్రా పోటీలు ప్రారంభం



కిక్‌కొట్టి పోటీలు ప్రారంభిస్తున్న సీఐ విజయ్‌భాస్కర్

నందికొట్కూరు: పట్టణంలోని నవనంది స్కూలు ప్రాంగణంలో శనివారం రాష్ట్ర స్థాయి సెపక్‌తక్రా సీనియర్ పోటీలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. సెక్‌తక్రా అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కేజీ గోవిందరెడ్డి, తహసీల్దార్ రాజశేఖర్‌బాబు, సీఐ విజయ్‌భాస్కర్ పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్ర జట్టుకు ఎంపిక చేసి మహారాష్ట్రలోని నాగపూర్‌లో జరిగే జాతీయ పోటీలకు పంపుతారు. అంతకుమునుపు క్రీడాకారులు కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో నవనంది పాఠశాల వ్యవస్థాపకుడు శ్రీధర్, రాష్ట్ర సెపక్‌తక్రా కార్యదర్శి శ్రీనివాసులు, పీడీ శంకర్‌రెడ్డి, వివిధ జిల్లాల కార్యదర్శులు అర్జున్‌రెడ్డి, మారుతీ ప్రసాద్, దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు

31న జిల్లాస్థాయి క్రికెట్ టోర్నీ

కొత్తపల్లి: ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని ముసలిమడుగు గ్రామంలో ఈనెల 31న జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్ విష్ణు, వెంకీ, రాజేష్ కన్నా, ప్రభాకర్, రాజాలు శనివారం తెలిపారు. 30వ తేదీలోపు ప్రవేశ రుసుము రూ.500 చెల్లించి జట్టు పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. విజేతలకు వరుసగా రూ.20వేలు, రూ.10వేలు బహుమతలు అందిస్తొన్నారు. 9701649015, 9121742745,9100156794 నంబర్లను సంప్రదించాలని వెల్లడించారు.

జాతరలో భక్తులకు సమస్యలు తలెత్తనివ్వం

- ఏప్రిల్ 1 నుంచి తర్తూరుకు ఆర్టీసీ బస్సుల ఏర్పాటు
- తాగునీటి ఎద్దడి నివారణకు పటిష్ట చర్యలు
- సమీక్ష సమావేశంలో అధికారులు



జాతర నిర్వహణపై చర్చిస్తున్న వివిధశాఖల అధికారులు

జూపాడుబంగ్లా: తర్తూరు శ్రీలక్ష్మీరంగనాథుని జాతరలో భక్తులకు ఎలాంటి సమస్యలు తలెత్తనివ్వమని వివిధ శాఖల మండల అధికారులు ముక్తకంఠంతో వెల్లడించారు. శనివారం తర్తూరు శ్రీలక్ష్మీరంగనాథ స్వామివారి ఆలయంలో సర్పంచ్ పీఎం నాగిరెడ్డి అధ్వర్యంలో మండలస్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈనెల 29 నుంచి నిర్వహించే స్వామివారి బ్రహ్మోత్సవాలకు వేలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉంది. జాతరకు వచ్చే భక్తులు ఎలాంటి అసౌకార్యలకులోను కాకుండా తీసుకోవాల్సిన పటిష్ట చర్యలపై చర్చించారు. జాతరకు వచ్చే భక్తులకు ఏప్రిల్ 01 నుంచి నందికొట్కూరు డిపో ఆర్టీసీ బస్సులు తిప్పుతామని డిపో మేనేజర్ నాగేశ్వరరావు తెలిపారు. జాతరలో తాగునీటి సమస్య తలెత్తకుండా ట్యాంకర్ల ద్వారా నీటిసరఫరాతో పాటు గ్రామంలోని చేతిపంపులు, ట్యాంకుల ద్వారా నిరంతరాయంగా నీటిని సరఫరా చేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగేంద్ర తెలిపారు. గ్రామంలో ఉన్న నాలుగుబోర్లలో పుష్కలంగా నీళ్లున్నందున తాగునీటి సమస్య తలెత్తే అవకాశాలుండవన్నారు. అలాగే ముందస్తు చర్యగా దాతల సహకారంతో తాగునీటి ప్యాకెట్ల పంపిణీ, చలివేంద్రాల ఏర్పాటు చేయిస్తామన్నారు. అలాగే ఏప్రిల్ 01 నుంచి గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామని పారుమంచాల వైద్యులు యశ్విని, మౌనిక తెలిపారు. ఆరోగ్యకేంద్రం ఉన్నప్పటికీ ఏప్రిల్ 01 నుంచి రెండు షిప్టుల ప్రకారంగా వైద్యశిబిరం నిర్వహించి జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చేస్తామని పారుమంచాల వైద్యులు యశ్విని, మౌనిక తెలిపారు. అలాగే ఎద్దుల కోసం పశువైద్య శిబిరం కూడా నిర్వహిస్తామని పశు వైద్యాధికారి డాక్టర్ పావనిరెడ్డి వెల్లడించారు.

29న పట్టు వస్త్రాల సమర్పణ

29 నుంచి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని స్వామివారికి అధికార లాంఛనాలతో రెవెన్యూ డిపార్టుమెంటు తరుపున పట్టువస్త్రాలు అందజేస్తామని తహసీల్దార్ పుల్లయ్యయాదవ్ తెలిపారు. భక్తులు తప్పనిసరిగా మాస్కు ధరించి స్వామివారి దర్శనానికి రావలెనని ఈఓ వెంకటరమణ తెలిపారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ బొమ్మన ప్రతాపరెడ్డి, నానిరెడ్డి అలియాస్ మద్దిలేటిరెడ్డి, ఎంపీపీ సువర్ణమ్మ, పీఆర్ ఏఈ బషీర్, ట్రాన్స్‌కో డీఈ శ్రీనివాసులు, ఏఈ రామాచారి, ఈఓపీఆర్డీ మణి మంజరి తదితరులు పాల్గొన్నారు.

టోల్ గేటు వేలంలో తగ్గిన ఆదాయం

తర్తూరు టోల్‌గేటు వేలాన్ని గతేడాది కంటే రూ.5 వేలు తక్కువ మొత్తానికి మండ్లెం గ్రామానికి చెందిన గానిగ శంకర్ దక్కించుకున్నట్లు సర్పంచ్ పీఎం నాగిరెడ్డి, కార్యదర్శి శరత్ తెలిపారు. శనివారం సర్పంచ్ పీఎం నాగిరెడ్డి అధ్వర్యంలో తర్తూరు జాతర టోల్ గేటు వసూళ్ల వేలం పాటలు నిర్వహించారు. ఈ వేలం పాట ల్లో కేవలం నలుగురు మాత్రమే పాల్గొన్నారు. ఇందు లో గానిగ శంకర్ అనే వ్యక్తి రూ.4లక్షలకు వేలం పాడి టోల్‌గేటు వసూళ్లను దక్కించుకున్నాడు. ఇతను ఈ నెల 29 నుంచి ఏప్రిల్ 12వ తేదీ వరకు తర్తూరులో టోల్‌గేటు వసూళ్లు చేసుకోవచ్చునన్నారు. కాగా గతేడా ది టోల్‌గేట్ వేలం రూ.4,05,000లకు పలికింది.

ఈనెల 24న లడ్డూ, టెంకాయలు, కొబ్బరి చిప్పల వేలం

జాతరలో లడ్డూ, టెంకాయలు, కొబ్బరి చిప్పల విక్రయానికి ఈనెల 24న ఆలయ ఆవరణలో వేలాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ ప్రతాపరెడ్డి, ఈఓ వెంకటరమణ తెలిపారు. ఆసక్తి ఉన్న వారు రూ.5వేలు ధరావత్తు చెల్లించి వేలం పాటల్లో పాల్గొనవచ్చునన్నారు.

రేపటి నుంచి మొబైల్ ఆధార్ సేవలు

మిడుతూరు: మండల పరిధిలోని గ్రామాలలో ఏర్పాటు చేస్తున్న ఆధార్ కేంద్రాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ జీఎస్ఎస్ రెడ్డి సూచించారు. మాసపేటలో 20న, కడుమూరు 21, చౌట్కూరు 27, చెరుకుచెర్ల 28, మిడుతూరులో 29వ తేదీన ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు.

పగిద్యాల: ఈనెల 20 నుంచి 29వ తేదీ వరకు మండల వ్యా ప్తంగా మొబైల్ ఆధార్ సేవలను అందచనున్నట్లు ఎంపీడీఓ వెంకటరమణ శనివారం తెలిపారు. 20న నెహ్రూనగర్-1 సచివాలయం, లక్ష్మాపురం-3, 21 న నెహ్రూనగర్, లక్ష్మాపురం -2, 27న పగిడ్యాల -1, లక్ష్మాపురం-1, 28న కొత్త ముచ్చుమర్రి, పగి డ్యాల-2, 29న పాత ముచ్చుమర్రి, పగిడ్యాల-3 సచివాలయాల్లో మొబైల్ ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు.

జూపాడుబంగ్లా మండలంలో..

జూపాడుబంగ్లా: ఈనెల 20న పారుమంచాల, తూడిచెర్ల, 21న తరిగోపుల, పి.లింగాపురం, 27న 80బన్నూరు, పోతులపాడు, 28న భాస్కరాపురం, తాటిపాడు, 29న తర్తూరు, తంగడంచ గ్రామాల్లో ఆధార్ అప్‌డేట్ ప్రత్యేక క్యాంపులను నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మణిమంజరి శనివారం తెలిపారు.

కొనసాగుతున్న సేవా కార్యక్రమాలు



మజ్జిగ పంపిణీ చేస్తున్న ఎస్‌ఐ, వైఎస్సార్‌సీపీ నాయకులు

పాములపాడు: ఉగాది పండుగను పురస్కరించుకొని శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్తున్న కన్నడీగులకు పాములపాడులో సేవా కార్యక్రమాలు శనివారం కూడా కొనసాగించారు. స్థానిక శ్రీ మల్లికార్జున స్వామి ఆశ్రమంలో నిత్యన్నదానంలో భాగంగా కన్నడిగులకు అన్నదానం, బెరెడ్డి సిద్ధార్థరెడ్డి యువసేన ఆధ్వర్యంలో అల్పాహారం, మజ్జిగ పంపిణీ కొనసాగించారు. రెండవ రోజు ఏఎస్ఐ ఏసయ్య పాల్గొని భక్తులకు తాగునీరు, మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో శేషన్న గౌడు, రామకృష్ణుడు, వెంకటేశ్వరరావు, జగదీష్‌గౌడు, చరణ్ కుమార్, మురళీగౌడు తదితరులు పాల్గొన్నారు.

కన్నడ భక్తులకు మజ్జిగ పంపిణీ

ఆత్మకూరు: మండలాపురం రాధాపురం గ్రామం వద్ద శ్రీశైలమహాక్షేత్రానికి కాలినడకన వెళ్లే కర్ణాటక భక్తులకు జంగమ మహేశ్వర సంఘం జిల్లా అధ్యక్షుడు లాల్‌బహదూద్ శాస్త్రి ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ 10 రోజులుగా భక్తులకు మజ్జిగ, అరటిపండ్లు, మంచినీటి పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఆ సంఘం సభ్యులు యశ్వంత్‌కుమార్, రాజేంద్ర,రవి, హరి, నటరాజ్, ప్రతాప్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

భక్తిశ్రద్ధలతో లక్షపుష్పార్చన



లక్షపుష్పార్చన పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఆత్మకూరు: పట్టణంలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం బ్రహ్మోత్సవాల సందర్భంగ లక్షపుష్పార్చన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో తరలిచవచ్చి స్వామిఅమ్మవార్ల ఉత్సవ విగ్రహాల ఎదుట పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. స్వామివారికి గరుడ వాహన సేవ నిర్వహించారు.

సీతారాముల విగ్రహాల బహూకరణ



విగ్రహాలకు అభిషేక పూజలు చేస్తున్న దాతలు

మహానంది: గాజులపల్లె రైల్వేస్టేషన్ గ్రామంలోని శ్రీ కోదండరామాలయానికి గోపవరం గ్రామానికి చెందిన ఇరగబోయిన పెద్దచెన్నయ్య, చిన్నచెన్నయ్య కుటుంబ సభ్యులు శనివారం విగ్రహాలను బహూకరించారు. శ్రీ సీతాసమేత రామలక్ష్మణులు, ఆంజనేయ స్వామి విగ్రహాలకు దాతల ఆధ్వర్యంలో అర్చకులు విశేష పూజలు చేశారు. షోడశోపచార పూజలు, అభిషేకం, అర్చన పూజలను శాస్త్రోక్తంగా చేపట్టారు.

ప్రాణదానం ట్రస్ట్‌కు విరాళం



దాతలకు బాండును అందజేస్తున్న అధికారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలదేవస్థానం నిర్వహిస్తున్న ప్రాణదానం ట్రస్టుకు శనివారం గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన సామ్రాజ్యం ఆమె తండ్రి జి.లక్ష్మారెడ్డి జ్ఞాపకార్థం రూ.1,00,000 విరాళంగా అందజేశారు. అలాగే ఆమె భర్త ఎం.శంకర్‌రెడ్డి జ్ఞాపకార్థం ఆలయంలో దేవతామూర్తుల విగ్రహములు తయారికి , శివలింగం ఏర్పాటుకు రూ.1,00,000 విరాళంగా ఇచ్చారు. ఈ విరాళాలను అధికారులు అందజేయగా వారు దాతలకు స్వామివార్ల శేష వస్త్రాలు, లడ్డూ ప్రసాదాలను అందజేశారు.

మహానందీశ్వరుడి స్పర్శదర్శనం కరువు

మహానంది: ప్రముఖ శైవక్షేత్రమైన మహానందిలో కొలువైన శ్రీ మహానందీశ్వరస్వామి, శ్రీ కామేశ్వరీదేవి అమ్మవార్లకు ఉదయం జరిగే మహా మంగళ హారతుల దర్శనానికి భక్తులు ఎంతో ఆసక్తి చూపుతారు. రూ.200 ఆర్జిత సేవాటికెట్ల ద్వారా వెళ్లే భక్తులకు హారతుల అనంతరం స్వామివారి నిజ రూపసమయంలో గర్భాయంలో స్పర్శదర్శనం ఉంటుంది. అయితే శనివారం వేకువజామున, ఉదయం వేళల్లో మహామంగళ హారతుల టికెట్లు ఇవ్వకుండా కేవలం రూ. 50, రూ. 30, రూ. 10 టికెట్లు మాత్రమే ఇచ్చి బయటి నుంచే స్వామివారి దర్శనం కల్పించారు. దీంతో ఎంతో దూరం నుంచి వచ్చామని, స్వామివారి స్పర్శదర్శనం లేకపోవడంతో అసంతృప్తితో వెనుదిరిగి వెళ్తున్నామని పలు ప్రాంతాలకు చెందిన ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి వాటిపై ముందుగానే భక్తులకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈవిషయంపై ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ కన్నడ భక్తుల రద్దీ మేరకు నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందన్నారు. రూ.200తో కల్పించే హారతుల దర్శనం రూ. 50, రూ. 30, రూ.10 టిక్కెట్లతోనే భక్తులకు అవకాశం కల్పించినట్లు చెప్పారు.

కార్పొరేట్ స్థాయి విద్యనందించాలన్నాదే ఆశయం

పగిద్యాల: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కార్పొ రేట్ స్థాయి ఇంగ్లీష్ విద్యను అందించాలన్నదే ప్రభు త్వ ఆశయమని, ఉపాధ్యాయులు అందుకు అనుగుణంగా ఉత్తమ బోధనను అందించాలని ఎంఈఓ సు భాన్ సూచించారు. శనివారం మండలంలోని పడమర ప్రాతకోట మెయిన్ పాఠశాల, ఎస్సీ స్పెషల్ పాఠశాలలను తనిఖీ చేశారు. విద్యార్థులు తయారు చేసిన బొమ్మలను తిలకించి అభినందించారు. నో బ్యాగ్ డే సందర్భంగా విద్యార్థుల వర్క్ బుక్స్‌ను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. స్వీట్ పొంగల్ సరిగా తయారు చేయలేదని వంట మహిళలను మందలించారు.